క్లుప్తంగా

కార్మికుల సమస్యపై దృష్టి సారించాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై దృష్టి సారించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు ఆదినారాయణ, యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్‌లతో కలిసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు వై.రమాదేవి, శివకుమారి, దుర్గా భవాని, కార్మికులు యహోషువా, సూర్యప్రకాశరావు, సాంబశివరావు, పిచ్చయ్య, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా కుట్టు మిషన్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సోమవారం ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి హాజరై 40 మంది మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు కుట్టుమిషన్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, మంగళగిరి పట్టణ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు సింహాద్రి బేబిరాణి, మంగళగిరి మండల తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, ట్రైనర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మేడికొండూరు: జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఈనెల 26న గుంటూరు హౌసింగ్ బోర్డులోని సుమేధ హైస్కూల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న పేరేచర్ల జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచి 13 మంది బహుమతులు సాధించారని ప్రధానోపాధ్యాయులు రంగరాజు సోమవారం తెలిపారు. హైస్కూల్‌కి చెందిన విద్యార్థిని, విద్యార్థులు టి.అనోష్, పి.విజయ సంజయ్, కె.అమూల్య, బి.శాంతి, ఎస్‌కే ఖాదర్, వి.కృష్ణ మనోహర్, ఎస్‌కే షాదిల్, వి.నాగ వీర, షేక్ బాజీ విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రోస్, మెడల్స్ సాధించారని ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలలో ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రస్థాయిలో కృష్ణా జిల్లాలో జరిగిన స్విమ్ అండ్ రన్ రాష్ట్రస్థాయి పోటీలలో మరో ఐదుగురు విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆలపాటి సుజాత, విజయలక్ష్మిలను పలువురు అధ్యాపకులు సన్మానించారు.

నాగులు మీరా జెండా పండుగ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజ్ వద్ద నాగుల్ మీరా జెండా పండుగను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఫిషర్‌మేన్ అధ్యక్షులు సైకం మల్లేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా నాగులు మీరా జెండా ఎత్తడం జరుగుతోందని.. ఇది తరతరాలుగా వస్తున్న ఆచారమని అన్నారు. మత్స్యకారులు సుఖ సంతోషాలతో ఉండాలని ఈ జెండా పండుగను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకం సురేష్, శంకర్, లక్ష్మయ్య, వాసు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలో ఆన్ కాల్ పద్ధతిలో పనిచేసేందుకు అవసరమైన డ్రైవర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చి ఆరు సంవత్సరాలు దాటిన వారందరూ అర్హులన్నారు. తెనాలి డిపోలోని డీఎం కార్యాలయంలో, ఆఫీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించి అప్లికేషన్లు పొందాలని సూచించారు. అర్హులైన వారందరూ దీనిని ఉపయోగించుకోవాలన్నారు.

అతిసారం.. జాగ్రత్తలతోనే దూరం!

- వాతావరణ మార్పులతో లక్షణాలు
- వైద్య సూచనలు పాటించాలంటున్న నిపుణులు



సీతానగరంలోని ప్రభుత్వ వైద్యశాల

తాడేపల్లిరూరల్: అతిసార (నీళ్ల విరేచనాలు) లేదా డయేరియాగా పిలిచే ఈ వ్యాధి వైరస్ వల్ల వస్తుంది. కొన్ని రకాలైన బ్యాక్టీరియా, ప్రోటోజోవాల ద్వారా కూడా అతిసార వ్యాధి రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మనిషి రోజులో మూడు లేక అంతకంటే ఎక్కువ సార్లు వదులుగా విరేచనాలు చేసుకుంటే దానిని అతిసార అంటారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో జరిగే మరణాలకు అతిసార వ్యాధి రెండో ప్రధాన కారణం. డయేరియా అతి భయంకరమైన వ్యాధి కాకపోయినా దీని కారణంగా చాలా మరణాలు కూడా సంభవిస్తున్నాయి. చిన్న జాగ్రత్తలతో కూడా డయేరియాను నివారించుకోవచ్చు. కొద్దిపాటి ప్రాథమిక వైద్యంతో కూడా ప్రాణహాని జరగకుండా కాపాడుకోవచ్చు.

వాతావరణ మార్పులతోనూ ముప్పే..

సీజన్ మారినప్పుడు లేదా వర్షాలు కురుస్తున్నప్పుడు జ్వరం, దగ్గు, జలుబు వంటి రోగాలు వస్తాయి. ప్రస్తుతం అధికంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు, తాగునీరు కలుషితం కావడం, ఇతర వైరస్‌లు గాలి ద్వారా వ్యాపించడం, ఈగలు, దోమలు వంటివి సైతం విజృంభిస్తుండడం, ఇప్పుడు వ్యాధి కారకాలుగా మారుతున్నాయి. డయేరియా అనేది చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ అన్ని వయస్సుల వారికి వచ్చే సాధారణ వ్యాధి. ఈ కాలంలో ఎక్కువ మంది పిల్లలు దీని బారిన పడుతుంటారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

అతిసార వ్యాధిలో రెండు రకాలు. ఒకటి నీళ్ల విరేచనాలు. దీన్నే నార్మల్ డయేరియా అంటారు. రెండోది రక్తం బంకతో వచ్చే విరేచనాలు. దీన్ని డిసెంట్రీ అంటారు. పిల్లల్లో వచ్చే డయేరియాకు రోటా వైరస్, పెద్ద వాళ్లల్లో వచ్చే డయేరియాకు నోరో వైరస్‌లు కారణం. ఇవే కాకుండా రకరకాల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, బ్యాక్టీరియాలు, జీర్ణ వ్యవస్థ దెబ్బతినడం, ఫుడ్ పాయిజనింగ్ లాంటివి డయేరియాకు కారణమవుతాయి. డయేరియా సోకినప్పుడు శరీరంలో నీటి శాతం, లవణాలు తగ్గిపోయి నీరసంగా తయారవుతారు. ఆ సమయంలో శరీరానికి సరిపడా లవణాలు అందించకపోతే డీ హైడ్రేషన్ ఎక్కువై పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. అందుకే డయేరియాను వెంటనే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎప్పుడు ప్రమాదమంటే..

కొద్దిపాటి విరేచనాలకు ప్రమాదం ఏమీ జరగదు. విరేచనాలు ఎక్కువగా అయ్యి శరీరంలోని నీటి శాతం ఎక్కువగా తగ్గి, బీపీ తగ్గి శరీర భాగాలకు ప్రధానంగా మూత్రపిండాలు, మెదడుకు రక్తప్రసరణ తగ్గినప్పుడు ప్రాణహాని జరిగే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రధాన లవణాలైన సోడియం, పొటాషియంలు తగ్గిపోయి తీవ్రమైన బలహీనతకు గురై అపస్మారక స్థితిలోకి చేరుకొనే అవకాశం ఏర్పడుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే తొందరగానే ఈ అనారోగ్యం నుంచి బయటపడొచ్చు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి..



అతిసార వ్యాధి రాకుండా చర్యలు తీసుకునే విధంగా ప్రజలకు అవగాహనను పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాంతాలు సందర్శించి కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని అవగాహన కల్పించాము. ఇప్పటి వరకు ఎటువంటి అతిసార వ్యాధి కేసులు నమోదు కాలేదు. అతిసార వ్యాధి నివారణకు అవసరమైన చికిత్సను పీహెచ్‌సీలో నిర్వహిస్తాం.

– డాక్టర్ మానస, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యులు

ఎటువంటి ఆహారం తీసుకోవాలి..

నీళ్ల విరేచనాల వల్ల శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి పునరుద్ధరణ చేయాలంటే గ్లూకోజ్, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్ల లాంటివి తీసుకోవాలి. ఎలక్ట్రాల్ పొడి కలిపిన నీళ్లు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం లాంటివి తాగితే శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి పొందుతుంది. విరేచనాలతో పాటు వాంతులు కూడా అవుతుంటే సెలైన్ ఎక్కించాల్సి రావొచ్చు. తగినంత విశ్రాంతి తీసుకుంటూ డాక్టరు సూచించిన మందులు వాడితే వాంతులు, విరేచనాలు తగ్గుతాయి. అలా కాకుండా విరేచనాల్లో రక్తం, జిగురు లాంటివి కనిపిస్తున్నా, మూడు రోజులైనా విరేచనాలు, వాంతులు తగ్గకపోతే డాక్టరు సలహా తీసుకోవడం మంచిది.

రాకుండా ఇవి పాటించాలి..

- రక్షిత మంచినీరు, కాచి చల్లార్చిన నీటినే తాగాలి
- చేతిగోళ్లు పెంచుకోకూడదు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి
- తేలిగ్గా అరిగే పదార్థాలను తినాలి
- తినే ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు నో గ్యారెంటీ



బాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న వేమారెడ్డి

- ఇచ్చిన సంక్షేమ పథకాల్లోనూ కోతలే
- వైఎస్సార్‌సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు నో గ్యారెంటీ అని ప్రజలకు ఇప్పటికే అర్థమైందని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్), పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్ 2వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సీనియర్ నాయకులు జక్కిరెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి, వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కారని మండిపడ్డారు. గెలిచిన తరువాత సూపర్ సిక్స్ మాటే ఎత్తకుండా ప్రతిపక్షంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే పనిలోనే నిమగ్నమయ్యారని తెలిపారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టమన్న కూటమి నాయకులు.. ఇప్పుడు అవే స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలకు విద్యుత్ భారాలను మోపి నడ్డి విరుస్తున్నారని అన్నారు. సామాన్య ప్రజలు ప్రశ్నిస్తుంటే వారిని అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చాగంటి బాపిరెడ్డి, ఉపాధ్యక్షులు జీలగ గాలయ్య, వేల్పుల ఎలీషా, ప్రధాన కార్యదర్శి చిన్న పోతుల దుర్గారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాబుది సూపర్ మోసం పాలన

దుగ్గిరాల: నమ్మి ఓట్లు వేసిన ప్రజలను చంద్రబాబు నిలువునా మోసం చేశారని దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. దుగ్గిరాల మండలం గొడవర్రు, పెదకొండూరు, పెదపాలెం, శృంగారపురం గ్రామాలలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాబు మోసాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు రేషన్ ఇంటింటికీ అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు టి.శివ గోపయ్య, ఎ.ధనుంజయ్, వెంకట్రావు, ప్రసంగి, పోతురాజు, సంసోనమ్మ, అశోక్, సుమన్, శేషయ్య, అర్జున్, ఎస్.రాజారావు, తిమోతి, తదితరులు పాల్గొన్నారు.



2వ వార్డు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



గొడవర్రు గ్రామంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

దోమల నియంత్రణకు గంబూషియా చేపలు



గంబూషియా చేపలను వదులుతున్న ఆశా కార్యకర్తలు



చేపలను నీటిలో వదులుతున్న డాక్టర్ మానస మంజరి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వైద్యాధికారులు సోమవారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా తాడేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పి.శాంత కుమారి, ప్రకాష్ నగర్ వైద్యాధికారి డాక్టర్ మానస మంజరి మాట్లాడుతూ.. ప్రకాష్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, వివిధ ప్రాంతాల్లో మొత్తం 10 నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించామని అన్నారు. వాటిలో దోమలు వ్యాప్తి చెందకుండా.. దోమల గుడ్లు, లార్వా దశలో ఉన్న దోమలను తినడానికి గంబూషియా చేపలను విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి సబ్ యూనిట్ ఆఫీసర్ సుధీర్ కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, శ్రీలక్ష్మి, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో చిలువూరు, మొరంపూడి, తుమ్మపూడి, మంచికలపూడి గ్రామాల్లో సోమవారం గంబూషియా చేపలను వదిలారు. చెరువులు, మురుగు నీటి కుంటలలో ఈ చేప పిల్లలను వదలడంతో అవి దోమ గుడ్లు, లార్వా తినడం వల్ల దోమల వ్యాప్తి అరికట్టవచ్చునని డాక్టర్ రెహమాన్ తెలిపారు. కార్యక్రమంలో పున్నారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు నేడు

తాడికొండ: తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత మెదడు, నరాలకు సంబంధించిన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుందరాచారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో తాడికొండలోని రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరాన్ని మండలంలోని ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం ఉంటుందని.. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధికారులు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



కమిషనర్ కృష్ణతేజతో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ), జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ.. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలై 7 నెలలు అయినా రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకూ వాటిని గ్రామ పంచాయతీ ఖాతాల్లోకి బదిలీ చేయలేదని, వాటిని త్వరగా బదిలీ చేయించాలని కోరామని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన రిజిస్ట్రేషన్ సర్‌చార్జి అమౌంట్ కూడా పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని కూడా రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో మాట్లాడి గ్రామ పంచాయతీ ఖాతాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. పై సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ కృష్ణతేజ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

రహదారి ప్రమాదకరంగా మారింది సార్..

- మునిసిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు
- సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీపీఎం నాయకుల అర్జీ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెనాలి: ప్రమాదకరంగా మారిన రహదారి నిర్మాణంపై మున్సిపల్ అధికారులు ఏడాదికాలంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం నాయకులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. తమకున్న జ్యుడీషియల్ అధికారం ద్వారా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఎం నాయకులు కె.బాబుప్రసాద్, షేక్ హుస్సేన్ వలి అర్జీని సమర్పించారు. స్థానిక చెంచుపేట 28వ వార్డులో కైలాస్‌భవన్ రోడ్డులో డోర్‌నెంబర్ 13-13-13 వరకు సుమారు 500 అడుగల నిడివి సిమెంటురోడ్డు నిర్మాణానికి తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇదే అంశంపై గత ఏడాది జూలై 15న సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీని ఇచ్చామనీ, జూలై 29న మున్సిపల్ కమిషనర్‌కూ అర్జీని ఇచ్చినట్టు గుర్తుశారు. సంవత్సరం గడచినా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు మున్సిపల్ చట్టం ప్రకారం కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పన్ను చెల్లింపుదార్లకు ఉన్న హక్కులను అధికారులు విస్మరించారని విమర్శించారు. కొద్దిరోజులుగా కుండపోత వర్షాలతో బాట ప్రమాదకరంగా మారిందన్నారు. అదే రోడ్డులో 150 కుటుంబాలకు రోడ్డులో రాకపోకలు సమస్యాత్మకంగా మారిందని షేక్ హుస్సేన్‌వలి చెప్పారు. అధికారులు ఇకనైనా స్పందించి రోడ్డు వేయాలని కోరారు.

సంబంధిత ఫొటోలతో సహా అర్జీని సమర్పించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 11 అర్జీలు వచ్చాయి. కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్ బాబు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూశాఖ పరిధిలోనివి అయిదు అర్జీలు రాగా, మున్సిపాలిటీ పరిధిలో రెండు, పంచాయతీరాజ్ శాఖలో ఒకటి, పోలీసు విభాగానికి సంబంధించి ఒకటి, విద్యాశాఖ పరిధిలో మరొక అర్జీ వచ్చాయని ఏవో తెలిపారు. సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి వాహనం బోల్తా



దుగ్గిరాల: విజయవాడ నుంచి తెనాలిలోని ఫర్నీచర్ షాపునకు వెళుతున్న టాటా ఏసీ వాహనం మంచికలపూడి వద్ద సోమవారం బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న ఒక ఆటోను తప్పించబోయిన టాటా ఏసీ వాహనం అదుపుతప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. కాగా ఘటనలో ఎటువంటి ప్రాణహాని జరగలేదని స్థానికులు పేర్కొన్నారు.

ఘనంగా గోదాదేవి జన్మదినోత్సవం



తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాలస్వామీజీ ఆధ్వర్యంలో అర్థ చాతు ర్మాస వ్రతదీక్షా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 19వ రోజైన సోమవారం గోదాదేవి పుట్టినరోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. తుళ్లూరు నుంచి శ్రీకృష్ణాశ్రమం శ్రీస్కంధ దేవానందగిరి స్వామివారు, గోదాదేవికి ప్రత్యే క పూజలు చేసి అమ్మవారి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

డైవర్షన్ రోడ్డులో ప్రయాణానికి అవస్థలు!



ఈమని నుంచి వల్లభాపురం వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. దీంతో వాహనాలు పక్క నుంచి వెళ్లడానికి డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. కాగా ఈ డైవర్షన్ రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ వర్షం పడుతుండడంతో నల్లమట్టి బురదగా మారి వాహనాలు అందులో ఇరుక్కుపోవడానికి అనుగుణంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

– దుగ్గిరాల

30న కొలకలూరులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ఎంపీడీవో దీప్తి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఈ నెల 30న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆహార పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు గ్రామంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గల శానిటేషన్ వర్కర్లు ఈ డ్రైవ్‌లో పాల్గొంటారని వెల్లడించారు. ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శానిటేషన్ వర్క్ జరుగుతుందని చెప్పారు. మండలంలో అత్యధిక జనాభా కలిగిన గ్రామం కొలకలూరుగా తెలిపారు. అదే విధంగా ఉదయం 9 గంటల నుంచి మంత్రి మనోహర్ గ్రామంలో స్పెషల్ గ్రీవెన్స్ రూపంలో అర్జీలు స్వీకరిస్తారని, మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. మండలస్థాయి అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొంటారని స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్మశాన వాటిక స్థలం కోసం కలెక్టర్‌కు వినతి

దుగ్గిరాల: గత 60 సంవత్సరాలుగా యానాదులకు కంఠంరాజుకొండూరు గ్రామంలో శ్మశాన వాటిక లేదని జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. యానాదుల యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు మాట్లాడుతూ.. యానదులు మరణిస్తే దహనం చేయడానికి స్థలం లేదని, రోడ్డు పక్కన దహనం చేయాల్సి వస్తోందని అన్నారు. గుంటూరు జిల్లా కలెక్టరు గ్రీవెన్స్‌లో సమస్యపై వినతిపత్రం ఇచ్చామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గోపి, నరసింహారావు, అంకమ్మరావు, పాల్గొన్నారు.

మీ అంతు చూస్తా....

మేనేజర్ చాంబర్‌లో మహిళా ఉద్యోగిని దురుసు ప్రవర్తన

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని పలువురు ఉద్యోగులపై దూషణలకు దిగింది. అంతటితో ఆగకుండా మీ అంతు చూస్తానంటూ బెదిరించింది. వివరాల్లోకి వెళితే.. మున్సిపల్ కార్యాలయంలోని మేనేజర్ చాంబర్‌లో పనిచేసే ఓ మహిళా ఉద్యోగిని సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అవకతవలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైంది. దీంతో ఆమె సోమవారం తన కార్యాలయానికి వచ్చి ఒక మహిళా ఉద్యోగినిపై దూషణలకు దిగింది. దీనిపై మేనేజర్ వారించగా ఆయననూ బెదిరించింది. తన స్థానంలో వేరే మహిళా ఉద్యోగి రానున్నదనే ప్రచారం నేపథ్యంలో ఆమెకూ ఫోన్‌చేసి బెదిరించింది. దీంతో అవాక్కు అయిన మేనేజర్, ఇతర మహిళా ఉద్యోగినిలు ఆమెపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడినట్లు సమాచారం. తన స్థానాన్ని మార్చిన వారందరి అంతుచూస్తానంటూ దూషణలకు దిగినట్లు పేరు చెప్పేందుకు ఇష్టపడని ఉద్యోగి తెలిపారు. ఆమె వ్యవహారం వివాదస్పదంగా మారడం మున్సిపల్ కార్యాలయంలో చర్చనీయాశంగా మారింది.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

తెనాలిటౌన్: తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ నిర్వహించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో సోమవారం తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ నందివెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలనందలి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తన్నీరు శివశంకర్ పాల్గొని వీటిని అందజేశారు. గ్రామానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, సుబ్బారావు, శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, అనిల్, శేషు, నాగరాజు పాల్గొన్నారు.